# అత్తను చంపిన అల్లుడు

- కుటుంబ కలహాలే కారణం
- గన్‌తో కాల్చి హత్య చేసిన కానిస్టేబుల్
- పోలీసుల అదుపులో నిందితుడు
- గుండ్ల సింగారంలో ఘటన


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ బారి


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

నయాంనగర్, అక్టోబర్ 12 : అత్తను అల్లుడు గన్‌తో కాల్చి హత్య చేసిన ఘటన కేయూసీ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ గుండ్ల సింగారంకు చెందిన అనిగాల కమల(50)కు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నాడు. పెద్ద కుమార్తె రమాదేవి భర్త ఆడె ప్రసాద్ రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రసాద్, రమాదేవి మధ్య కొన్ని సంవత్సరాలుగా గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల ప్రసాద్‌పై మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, నెలకు రూ.15వేల చొప్పున డబ్బులు పంపిస్తా అని ప్రసాద్ చెప్పాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం ప్రసాద్‌కు, అతడి బావమరిది దేవేందర్‌తో మధ్య గొడవ జరిగింది. దీంతో అత్త, బామమరిదిపై కక్ష పెంచుకొన్న ప్రసాద్ వారిని అంతం చేయాలనే ఆలోచనతో తాను పనిచేస్తున్న పోలీసు స్టేషన్ ఎస్సై తుపాకీని తీసుకొచ్చాడు. గురువారం ఉదయం తన అత్త కమలతో మాట్లాడుతూ గతంలో ఇచ్చిన రూ.4లక్షల గురించి అడిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరుగడంతో గన్‌తో అత్తను కాల్చి చంపాడు. తుపాకీ పేలిన శబ్దంతో బయటకు వచ్చిన కుటుంబసభ్యులు ప్రసాద్‌ను నెట్టివేయగా, గాయలయ్యాయి. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని డీసీపీ బారి, ఏసీపీ డేవిడ్ రాజ్, సీఐలు అబ్బయ్య, గోపి, కరుణాకర్ పరిశీలించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. కుమారుడు దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీసీపీ తెలిపారు.

### ప్రసాద్‌కు ఎంజీఎంలో చికిత్స..

వరంగల్ చౌరస్తా : కుటుంబ కలహాలతో అత్తను కాల్చి చంపగా, కోపంతో కుటుంబసభ్యులు నెట్టివేయడంతో తీవ్ర గాయాలపాలైన కానిస్టేబుల్ ఆడె ప్రసాద్‌కు ఎంజీఎం దవాఖానలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వైద్యులు అతడి తలపై గాయానికి సుమారు 10 కుట్లు వేశారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

## రూ.2.31 కోట్ల కుంభకోణంపై విచారణ షురూ

- అన్వేష్ ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ స్వాధీనం
- మరో రెండు రోజుల పాటు విచారించనున్న పోలీసులు

వరంగల్, అక్టోబర్ 12 : ఫోర్జరీ, బోగస్ ఫైళ్ల కుంభకోణంలో సూత్రధారి, బల్దియా సీనియర్ అసిస్టెంట్ బండా అన్వేష్‌ను పోలీసులు విచారిస్తున్నారు. బుధవారం కోర్టు పోలీసుల కస్టడీకి అప్పగించడంతో ఖమ్మం జైలు నుంచి అన్వేష్‌ను మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, సీఐ వెంకటేశ్వర్లు విచారించారు. ఫోర్జరీ సంతకాలు, బోగస్ ఫైళ్లతో రూ.2.31 కోట్ల కుంభకోణంపై అన్వేష్ వద్ద నుంచి పోలీసులు కీలక సమాచారం రాబట్టినట్లు తెలిసింది. కేసులో ఇంకెవరికి సంబంధాలు ఉన్నాయనే దానిపై విచారించినట్లు సమాచారం. అన్వేష్ ల్యాప్‌ట్యాప్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కార్పొరేషన్ కమిషనర్ చాంబర్‌లో ఉన్న కంప్యూటర్‌లో కొంత సమాచారం ఉన్నదని అన్వేష్ చెప్పినట్లు తెలిసింది. మరో రెండు రోజుల పాటు పోలీసులు విచారించనున్నట్లు సమాచారం. అయితే అంతా తానే చేసినట్లు అన్వేష్ ఒప్పుకోవడం గమనార్హం.

### చికిత్స పొందుతూ బాలుడి మృతి

వాజేడు, అక్టోబర్ 12 : మండల కేంద్రానికి చెందిన చిడెంపల్లి రోహిత్(13)ను ఈ నెల 8న ద్విచక్ర వాహనం ఢీకొట్టగా, హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కళ్ల ముందే తమ కుమారుడు యాక్సిడెంట్‌లో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందడంతో తల్లిదండ్రులు మహేశ్వరి, సాంబయ్య యాదవ్ రోదిస్తున్న తీరు అక్కడ ఉన్నవారిని కంటతడి పెట్టించింది.


రోహిత్(ఫైల్)

### ఇన్‌చార్జి సీపీగా డీసీపీ మురళీధర్ బాధ్యతల స్వీకరణ

సుబేదారి, అక్టోబర్ 12 : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ బదిలీ కాగా, ఇన్‌చార్జ్ సీపీగా క్రైమ్స్ డీసీపీ దాసరి మురళీధర్ గురువారం విధుల్లో చేరారు. హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో మురళీధర్ బాధ్యతలు చేపట్టారు.

### వరంగల్‌లో సైకో వీరంగం

వరంగల్ చౌరస్తా/పోచమ్మమైదాన్, అక్టోబర్ 12 : కాలిన గాయాలతో ఎంజీఎం దవాఖానకు చేరుకున్న సైకో ప్రవర్తనకు వైద్య సిబ్బంది భయాందోళనలకు గురయ్యారు. గురువారం ఉదయం ఒంటి నిండా కాలిన గాయాలతో 108లో ఎంజీఎంకు చేరుకున్న గుర్తు తెలియని వ్యక్తికి సిబ్బంది చికిత్స చేస్తుండగా ఒక్కసారిగా బయటకు పరుగులు తీశాడు. కొంత సమయానికి పోలీసులు తిరిగి తీసుకువచ్చి దవాఖానలో చేర్పారు. తిరిగి వైద్యులు చికిత్స అందిస్తుండగా నర్సింగ్ ఆఫీసర్ విశ్రాంతి గదిలోకి దూరడానికి ప్రయత్నించాడు. దీంతో ఆ వ్యక్తిని తిరిగి క్యాజువాలిటీకి తరలించి భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసి చికిత్స అందించారు. అంతకు ముందు వరంగల్ పోచమ్మమైదాన్ జంక్షన్‌లో వీరంగం సృష్టించాడు. జంక్షన్‌లోని రాణి రుద్రమదేవి విగ్రహం పక్కన మెట్లపైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. పోలీసులతో పాటు స్థానికులు ఎంత చెప్పినా పైనుంచి దిగి రాలేదు. దీంతో కొందరు కర్రలు పట్టుకుని బెదిరిస్తూ కిందికి దింపి పోలీసులకు అప్పగించారు. కాగా, ఈ క్రమంలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

### జోనల్ స్థాయి క్రీడోత్సవాలను జయప్రదం చేయాలి

రాయపర్తి, అక్టోబర్ 12 : మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించతలపెట్టిన తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ 9వ జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను జయప్రదం చేయాలని గురుకుల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ కోరారు. గురువారం గురుకులంలో క్రీడా పోటీల ఇంచార్జులు దేవీ సునీల ప్రభ, వెంకటేశ్వర్లు, దేవీప్రసాద్, నాజియాబేగం, ప్రభావతి, కళమ్మ, హేమతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఈ క్రీడా పోటీల్లో వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లోని 14 బాలికల గురుకులాల నుంచి క్రీడా విద్యార్థులకు హాజరవుతున్నట్లు చెప్పారు. అండర్ -14, 17, 19 విభాగాల్లో వాలీబాల్, బాడ్మింటన్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఖోఖో, టెన్నికాయిట్, చదరంగం, క్యారమ్స్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్లు, 200, 400, 800, 1500, 3000 మీటర్లు, షాట్‌పుట్, డిస్కస్ త్రో, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలు ఉంటాయన్నారు. మొత్తం 1190 మంది పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. పోటీలను కలెక్టర్ పీ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, గురుకులాల సొసైటీ కార్యదర్శి నవీన్ నికోలస్, ఆర్‌సీవో సూరినేని విద్యారాణి, జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి ప్రారంభించనున్నట్లు తెలిపారు.


జోనల్ మీట్ వివరాలను వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్

# ములుగులో గంజాయికి అడ్డుకట్ట

- జిల్లాలో రూ.2 కోట్ల విలువైన 757 కిలోలు పట్టివేత
- దహనం చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ గౌష్‌ఆలం
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిక


ములుగు : గంజాయిని దహనం చేస్తున్న ఎస్పీ, ఓఎస్డీ, ఏఎస్పీ

ములుగు, అక్టోబర్ 12(నమస్తేతెలంగాణ) : గంజాయి సాగుతో పాటు విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు ములుగు జిల్లా పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారని, అందులో భాగంగా గతంలో వివిధ కేసుల్లో పట్టుబడిన రూ.2కోట్ల విలువైన గంజాయిని గురువారం సాయంత్రం దహనం చేసినట్లు జిల్లా ఎస్పీ గౌష్‌ఆలం తెలిపారు. రోజురోజుకూ పెరుగుతున్న గంజాయి విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు కొంతకాలంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా ములుగు, పస్రా, ఏటూరునాగారం, మంగపేట, వెంకటాపురం(నూగూరు) పోలీస్‌స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో 757 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. డ్రగ్ డిస్పోజుబుల్ కమిటీ ఆదేశాల మేరకు తగిన జాగ్రత్తలు పాటిస్తూ పట్టుబడిన గంజాయిని రహస్య ప్రాంతంలో ధ్వంసం చేసినట్లు చెప్పారు. యువతను ప్రలోభాలకు గురి చేస్తూ గ్రామ, పట్టణ ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తూ కొంత మంది అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారని, గ్రామాల్లో ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్రగ్ డిస్పోజుబుల్ కమిటీ సభ్యులు ఓఎస్డీ అశోక్ కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, సీఐలు దయాకర్, సతీశ్, ఆర్‌ఐ వెంకట నారాయణ, ఎస్సై కమలాకర్ పాల్గొన్నారు.

### కిలో ఎండు గంజాయి పట్టివేత..

జనగామ చౌరస్తా : జనగామలోని బాణాపురం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు బైక్‌పై తరలిస్తున్న కిలో ఎండు గంజాయి పార్సిల్‌ను పట్టుకున్నారు. గురువారం అర్బన్ సీఐ ఎలబోయిన శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బాణాపురం ఏరియాకు చెందిన బండి గణేశ్ బైక్‌పై ఎండు గంజాయి పార్సిల్‌ను తరలిస్తూ వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై మాచర్ల శ్వేత బృందాన్ని చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. వెంబడించిన పోలీసులు నిందితుడిని పట్టుకొని విచారించగా, రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని జనగామ తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ.25 వేల వరకు ఉంటుందన్నారు. గంజాయితో పాటు నిందితుడి బైకెను కూడా సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. గణేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఇతడికి గంజాయి విక్రయించిన మిగతా నిందితులను కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు.


జనగామ చౌరస్తా : పోలీసులు స్వాధీనం చేసుకున్న కిలో ఎండు గంజాయి పార్సిల్

### నేడు క్యాంపెయిన్ ముగింపు

వెంకటాపూర్, అక్టోబర్ 12 : మండలంలోని పాలంపేట హరిత హోటల్‌లో నిర్వహిస్తున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్ క్యాంపెయిన్ శుక్రవారం ముగియనుంది. గురువారం టూరిజం డెస్టినేషన్స్ అండ్ ప్రొడక్ట్స్ ఆఫ్ తెలంగాణపై అసిస్టెంట్ టూరిజం ఆఫీసర్, సేవా టూరిజం అధ్యక్షుడు కుసుమ సూర్యకిరణ్, ట్రైబల్ టూరిజంపై కేయూ స్కాలర్ గుగులోత్ మహేశ్, ప్రొఫెసర్ మల్లికార్జున్, నారాయణ వివరించారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు, కేయూ టూరిజం స్కాలర్ కొక్కుల ప్రశాంత్, ట్రస్టు సభ్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నిట్‌లో ట్రాన్స్‌పోర్టేషన్‌పై సదస్సు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 12 : వరంగల్ నిట్‌లో ట్రాన్స్‌పోర్టేషన్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్(సీటీఎస్‌ఈఎం-2023)పై 9వ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ సదస్సును ప్రారంభించారు. ఇందులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు కీలక ప్రసంగాలు చేయనున్నారు. మొదటి రోజు మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ జే మురళీకృష్ణన్, ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్ కే సుధాకర్‌రెడ్డి వారి అనుభవాలు, పేవ్‌మెంట్ ఇంజినీరింగ్‌లో ప్రధాన పరిశోధనలను విద్యార్థులతో పంచుకున్నారు. సదస్సులో సుమారు 150 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు తమ పత్రాలను సమర్పించి, నిపుణుల నుంచి విలువైన సూచనలను స్వీకరించనున్నారు. సదస్సు సమన్వయకర్తలు డాక్టర్ కేవీఆర్ రవిశంకర్, ఎస్ శంకర్, అర్పణ్ మెహర్, కో ఆర్డినేటర్లు బీ రఘురాం కడలి, విష్ణు, కన్వీనర్ ప్రొఫెసర్ వెంకయ్య పాల్గొన్నారు.


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్